నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్ - నిర్మల్
5 | నిజామాబాద్ సోమవారం 30 సెప్టెంబర్ 2024 | ADILABAD NIRMAL

కరాటేతో ఆత్మస్థైర్యం పెరుగుతుంది..

కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్

నిర్మల్ అర్బన్, సెప్టెంబర్ 29 : కరాటే వల్ల ఆత్మస్థైర్యం పెరుగుతుందని, క్రమశిక్షణతో విద్యార్థులు కరాటే నేర్చుకోవాలని నిర్మల్ మున్సిపల్ చైర్మన్ గంజ్రత్ ఈశ్వర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని తిరుమల గార్డెన్స్‌లో ఆదివారం చుక్క ధర్మరాజు మెమోరియల్ స్పోర్ట్స్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి కరాటే చాంపియన్‌షిప్ పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

లోకారి(బీ)లోని ప్రాథమికోన్నత పాఠశాల

బోధన సాగేదెలా..

- 102 మంది విద్యార్థులకు ఇద్దరే ఉపాధ్యాయులు
- మెరుగైన విద్యకు దూరమవుతున్న గిరిజనులు

నార్నూర్, సెప్టెంబర్ 29 : గాదిగూడ మండలంలోని లోకారి(బీ) మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో 102 మంది గిరిజన విద్యార్థులకు ఇద్దరే ఉపాధ్యాయులు బోధన చేస్తున్నారు. ఏడు తరగతుల నిర్వహణ కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకటో తరగతిలో 31, రెండో తరగతిలో 27, మూడో తరగతిలో 10, నాలుగో తరగతిలో 10, ఐదో తరగతిలో 15, ఆరో తరగతిలో 7, ఏడో తరగతిలో 2 మంది విద్యార్థులు చదువుకుంటున్నట్లు ఉపాధ్యాయులు చెబుతున్నారు. కనీసం ఐదుగురు ఉండాల్సిన చోట ఇద్దరు ఉపాధ్యాయులతో సరిపెట్టుకుంటున్నారు. ఉపాధ్యాయుల బదిలీలు జరిగిన కనీసం ఉపాధ్యాయులను నియమించకపోవడం గమన్హారం. ఈ విషయంపై ప్రధానోపాధ్యాయురాలు ఆడే సంధ్యరాణిని వివరణ కోరగా.. ఏడు తరగతుల నిర్వహణ ఇద్దరు ఉపాధ్యాయులకు ఇబ్బందిగా ఉంది. కనీస సౌకర్యాలు లేక అవస్థలు పడుతున్నాం. సంబంధిత శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

విద్యార్థులకు బోధిస్తున్న ఉపాధ్యాయులు

రూ.4 వేల పెన్షన్ వస్తలేదు సార్..

డేడ్రా గ్రామ పర్యటనలో భాగంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ గ్రామస్తుల సమస్యలను తెలుసుకుంటున్న క్రమంలో ఓ వృద్ధురాలు సారూ.. నాకు రూ.4 వేల పెన్షన్ వస్తలేదు. కాస్తా ఇప్పించండి సారూ అంటూ వేడుకున్నది. ఎన్నికల్లో అడ్డగోలుగా వాగ్ధానాలు చేసిన కాంగ్రెస్ పార్టీ మాటలు నమ్మి మోసపోయినమని ఆ వృద్ధురాలు పేర్కొంది.

నడుచుకుంటూ డేడ్రా గ్రామానికి వెళ్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

ప్రజాసేవ కోసం పాటు పడుతా

- బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్
- బాల వికాస్ వాటర్ ప్లాంట్ ప్రారంభం
- మిషన్ భగీరథ నీరు వచ్చాకే కంటినిండా నిద్ర పోతున్నాం

బజార్‌హత్నూర్, సెప్టెంబర్ 29 : మారుమూల గ్రామల అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతూ ప్రజాసేవ కోసం అంకితభావంతో ప్రజల మధ్య ఉంటూ ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. ఆదివారం డేడ్రా, మాన్కపూర్, ఉమార్డ గ్రామాల్లో ఆయన పర్యటించారు. ముందుగా డేడ్రా గ్రామస్తులు మేళతాళాలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఉమార్డ, డేడ్రా గ్రామాలకు మంజూరైన బాల వికాస్ మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఎమ్మెల్యే చేతుల మీదుగా గ్రామస్తులు ప్రారంభించారు. ఈ సందర్భంగా డేడ్రా గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మారుమూల గ్రామల అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతూ ప్రభుత్వం దృష్టికి సమస్యలను తీసుకెళ్తున్నాని ఆయన పేర్కొన్నారు.

బీటీ రోడ్డుతో మళ్లీ వస్తా..

మారుమూల డేడ్రా గ్రామానికి సరైన రోడ్డు వసతి లేకపోవడంతో ఎమ్మెల్యే తన కార్యకర్తలతో కలిసి ఐదు కిలోమీటర్ల మేర కాలినడకన డేడ్రా గ్రామానికి చేరుకుని గ్రామస్తుల సమస్యలను తెలుసుకున్నారు. త్వరలోనే భూతాయి నుంచి డేడ్రా గ్రామానికి రూ. 1.75 కోట్లు, డేడ్రా నుంచి మాన్కపూర్ వరకు రూ.1.55 కోట్లు, భూతాయి(కె) నుంచి ఉమార్డ వరకు రూ.3.77 కోట్లు, భూతాయి(కె) నుంచి గిరిజాయి వరకు రూ.1.10 కోట్లతో బీటీ రోడ్లు మంజూరై ఉన్నాయని తెలిపారు. వీటిని త్వరలోనే ప్రారంభించి, మళ్లీ బీటి రోడ్లతో వస్తానని గ్రామస్తులకు వాగ్ధానం చేశారు.

మిషన్ భగీరథ నీరొచ్చాకే కంటి నిండా నిద్ర పోతున్నాం..

మారుమూల నక్సలైట్ ప్రభావిత ప్రాంతాలైన డేడ్రా, ఉమార్డ, మాన్కపూర్ గ్రామల్లోని ప్రజలు గత బీఆర్ఎస్ ప్రభుత్వంలోని మిషన్ భగీరథ నీరు వచ్చాకే కంటి నిండా నిద్ర పోతున్నామని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఎన్నో ప్రభుత్వాలు మారినా తమ నీటి కష్టాలను పట్టించుకోలేదని వాపోయారు. కానీ.. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో స్వచ్ఛమైన భగీరథ నీరు అందుతుందని కేసీఆర్‌ను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల కన్వీనర్ కానిందె రాజారాం, నాయకులు చిల్కురి భూమయ్య, చట్ల గజ్జయ్య, కుర్మె లక్ష్మణ్, జనార్ధన్, అజయ్, కవీందర్, సుధీర్‌రెడ్డి, సుంకన్న లక్ష్మి, విద్యాసాగర్, జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.

పేదలకో న్యాయం.. పెద్దలకో న్యాయమా?

హైడ్రా పేరిట పేదల ఇండ్లను కొల్లగొడుతున్న కాంగ్రెస్

- కేసీఆర్ చేతులోనే తెలంగాణ సురక్షితంగా ఉంటది..
- కాంగ్రెస్‌పై విసిగి.. బీఆర్ఎస్ వైపు చూస్తున్న ప్రజలు
- బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్
- కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో పలువురి చేరిక

నేరడిగొండ, సెప్టెంబర్ 29 : 'హైడ్రా పేరిట పేదల ఇండ్లను కొల్లగొడుతున్నారని పేదలకు ఒక న్యాయం, పెద్దలకు ఒక న్యాయమా? అని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ప్రశ్నించారు. బోథ్ మండలంలోని గుట్టపక్కతండాకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు మట్ట చందర్‌సింగ్, కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షురాలు మట్ట అనితా బాయి ఆదివారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి నేరడిగొండలో ఎమ్మెల్యే అనిల్ జాదవ్ బీఆర్ఎస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పుట్టిన బిడ్డ తల్లిచేతిలో ఉంటే ఎలా ఉంటదో.. తెచ్చుకున్న తెలంగాణ కేసీఆర్ చేతిలోనే సురక్షితంగా ఉంటుందన్నారు. అందుకే ప్రజలు బీఆర్ఎస్ వైపు చూస్తున్నారని తెలిపారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ బీఆర్ఎస్ పార్టీ హయాంలోనే సురక్షితంగా ఉండేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది నెలలు కావస్తున్నా పరిపాలన గాలికి వదిలేశారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చెబుతున్న ప్రజాపాలన ఇదేనా అని ప్రశ్నించారు. ఇచ్చిన హామీలు నెరవేర్చక రాష్ట్ర ప్రజలను ఈ ప్రభుత్వం వంచిస్తుందని అసహనం వ్యక్తం చేశారు. ఆరు గ్యారెంటీల పేరిట ప్రజలను మోసం చేసి గద్దెనెక్కిన సీఎం రేవంత్‌రెడ్డి అమలు ఎక్కడా అని ప్రశ్నించారు. రైతు రుణమాఫీ పూర్తి చేస్తామని చెప్పి కొద్దిమందికే ఇచ్చి చేతులు దులుపుకోవడంపై రైతులు రగిలిపోతున్నారని మండిపడ్డారు. ఇందులో మాజీ సర్పంచ్ పవార్ ప్రకాశ్‌సింగ్, నానక్‌సింగ్, బాల్‌సింగ్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

కుల బహిష్కరణ అవాస్తవం

ఇచ్చోడ(సిరికొండ), సెప్టెంబర్ 29 : సిరికొండ మండలకేంద్రంలో ముదిరాజ్ సామాజిక వర్గంలో జరిగిన చిన్నపాటి పొరపాట్లను గోరంతలుగా చేస్తూ కుల బహిష్కరణ జరిగిందంటూ సోషల్ మీడియాతోపాటు ఇతర మీడియాల్లో వార్తలు రావడాన్ని తెలంగాణ మన ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సలేంద్ర శివయ్య ముదిరాజ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు బొజ్జ నారాయణ తీవ్రంగా ఖండించారు. ఆదివారం సిరికొండ గ్రామాన్ని సందర్శించి వాస్తవాలను తెలుసుకున్నారు. సంఘం భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. తమలో చిన్నపాటి బేధాబిప్రాయాలు వచ్చాయి తప్పా కుల బహిష్కరణ జరగలేదని ఏకగ్రీవంగా తీర్మానం చేస్తూ ఆమోద ముద్ర వేశారు. ఈ సమావేశంలో గౌరవాధ్యక్షులు ఓరుగంటి పెంటన్న, రాము, పట్టణ ముదిరాజ్ సంఘం అధ్యక్షులు ధారవేణి రాము, ప్రధాన కార్యదర్శి రవి, ఉపాధ్యక్షులు సలేంద్ర రాజు, జిల్లా ఉపాధ్యక్షులు బొమ్మెన లక్ష్మన్న, సిరికొండకు చెందిన నాయకులు ఓరుగంటి పెంటన్న ముదిరాజ్, ఎగ్గిడి మల్లేశ్, ముదిరాజ్ సంఘం మండల నాయకులు బోయినవాడ్ అమోల్, ఆవులపల్లి మాజీ సర్పంచ్ అయినవేని రాజు, పట్టణ నాయకులు కొండ వెంకటి, కుల పెద్దలు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న నాయకులు, కులస్తులు

దొంగ అరెస్టు

- వివరాలు వెల్లడించిన సీఐ కరుణాకర్‌రావ్

వివరాలను వెల్లడిస్తున్న టూ టౌన్ సీఐ కరుణాకర్‌రావ్

ఎదులాపురం, సెప్టెంబర్ 29 : మోటార్ సైకిల్ దొంగను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు టూ టౌన్ సీఐ కరుణాకర్‌రావ్ తెలిపారు. ఆదివారం టూ టౌన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. తిర్పెల్లికి చెందిన షేక్ అజీమ్ అహ్మద్ ఈనెల 22వ తేదీన ద్విచక్ర వాహనాన్ని పెట్రోల్ పంప్ సమీపంలో పార్కింగ్ చేశాడు. గుర్తు తెలియని వ్యక్తులు ద్విచక్ర వాహనాన్ని దొంగలించారు. 28వ తేదీన బాధితుడు అజీమ్ అహ్మద్ టూ టౌన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. ఆదివారం బస్టాండ్ సమీపంలో టూటౌన్ ఎస్సై విష్ణు ప్రకాశ్, ఐడీ పార్టీ సిబ్బంది బి.నరేశ్, కె.నరేందర్, సుధాకర్‌రెడ్డి, సంజీవ్, రమేశ్, గోపాల్ వాహనాలు తనిఖీ చేశారు. అనుమానాస్పదంగా కనిపించిన వ్యక్తిని పట్టుకుని విచారించారు. నేరడిగొండ మండలంలోని బుగ్గారం తండాకు చెందిన భుక్యా కృష్ణ రాథోడ్ వివరాలు తెలియజేశాడు. విచారణ చేపట్టిన పోలీసులు 2వ తేదీన పెట్రోల్ పంప్ సమీపంలో నుంచి వాహనాన్ని దొంగిలించినట్లు అంగీకరించాడు. మరో నాలుగు వాహనాలు దొంగలించినట్లు చూపించాడు. వివిధ పోలీస్ స్టేషన్‌లో 9 కేసు ఉన్నట్లు దర్యాప్తులో తెలిసిందన్నారు. ఈ మేరకు అతనిపై టూ టౌన్ ఎస్సై విష్ణు ప్రకాశ్ కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు.

దసరాకు ప్రత్యేక బస్సులు

ఎదులాపురం, సెప్టెంబర్ 29 : దసరా పండుగ పురస్కరించుకుని ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడుపుతుందని ఆదిలాబాద్ రీజినల్ మేనేజర్ సోలమన్ ఒక ప్రకటనలో తెలిపారు. అక్టోబర్ 1 నుంచి 11వ తేదీ వరకు నడుపుతున్నట్లు పేర్కొన్నారు. ఆదిలాబాద్‌కు 78, ఆసిఫాబాద్‌కు 73, భైంసాకు 11, మంచిర్యాలకు 125, నిర్మల్‌కు 120, ఉట్నూర్ 5 చొప్పున నడుపుతున్నట్లు తెలిపారు.

1న కరాటే ఎంపిక పోటీలు

ఎదులాపురం, సెప్టెంబర్ 29 : జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో అక్టోబర్ 1న మంగళవారం జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో అండర్-17 బాల బాలికల జిల్లాస్థాయి కరాటే ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎస్జీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కాంతారావ్ ఒక ప్రకటనలో తెలిపారు. 2008 జనవరి 1 తర్వాత ఆర్గనైజింగ్ సెక్రటరీ కాంతారావ్ ఒక ప్రకటనలో తెలిపారు. 2011 జనవరి 1 తర్వాత పుట్టిన 14 సంతవ్సరాల విభాగంలో ఎంపిక పోటీలో పాల్గొనేందుకు అర్హులని తెలిపారు. అర్హులైన క్రీడాకారులు సంబంధిత వయస్సు ధ్రువీకరణ పత్రం బోనఫైడ్‌తో ఉదయం 9 గంటలకు ఆదిలాబాద్ జిల్లా స్పోర్ట్స్ కరాటే అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు ముఖేశ్‌కుమార్, ప్రవీణ్‌కుమార్‌కు రిపోర్ట్ చేయాలని సూచించారు. ఇతర వివరాకలు 9492209290, 9440720131 నెంబర్‌కు సంప్రదించాలని కోరారు.

బీసీ రిజర్వేషన్ కోసం ఉద్యమిస్తాం..

- రిజర్వేషన్ తరువాతే స్థానిక సంస్థల ఎన్నికలు
- బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు డీ రాజారాం
- ఆర్‌అండ్‌బీ అతిథిగృహం వద్ద సత్యాగ్రహ దీక్ష


ఆర్‌అండ్‌బీ అతిథిగృహం వద్ద సత్యాగ్రహ దీక్షలో పాల్గొన్న బీసీ సంఘం నాయకులు

ఎదులాపురం, సెప్టెంబర్ 29 : తెలంగాణ ఉద్యమంలో ఏ విధంగానైతే పోరాడామో అదేవిధంగా బీసీ రిజర్వేషన్‌ల కోసం ఉద్యమిస్తామని బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు డి.రాజారాం యాదవ్ అన్నారు. ఆదివారం ఆర్‌అండ్‌బీ ఎదుట బీసీ జనసభ, బీసీ కులాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన సత్యాగ్రహ దీక్షలో పాల్గొన్నారు. కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. రిజార్వేషన్ ప్రకటించిన తరువాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రాజారాం మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి రాకముందు కామారెడ్డి సభలో బీసీ రిజర్వేషన్‌ను 42 శాతం ఇస్తామని ప్రకటించిందన్నారు. కానీ.. అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలవుతున్నా ఎలాంటి చర్యలు లేవన్నారు. కేవలం సీఎం తన సామాజిక వర్గానికే న్యాయం చేస్తు బీసీలను పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. బీసీలను చైతన్య పర్చడానికి జిల్లాలవారీగా కార్యక్రమాలను చేపడుతున్నామని పేర్కొన్నారు. ఈ దీక్షలో ప్రముఖ హోమియోపతి వైద్యులు రవికిరణ్ యాదవ్, బీసీ సంఘాల నాయకులు మేకల కృష్ణ, అవ్వారు వేణుకుమార్, గజేందర్, కాశవేణి నారాయణ, హన్మండ్లు యాదవ్, ఈర్ల సత్యనారాయణ, అన్నదానం జగదీష్, రఘువీర్‌యాదవ్ పాల్గొన్నారు.

సిబ్బంది కొరత

- జిల్లా సంక్షేమ శాఖ కార్యాలయంలో ఇక్కట్లు
- సిబ్బంది కొరత తీర్చాలని వేడుకోలు

జిల్లా సంక్షేమ శాఖ అధికారి కార్యాలయం

నిర్మల్ టైన్‌గేట్, సెప్టెంబర్ 29 : నిర్మల్ జిల్లా మహిళా, శిశు, వయో వృద్ధులు, దివ్యాంగుల శాఖ కార్యాలయంలో సిబ్బంది కొరత వేధిస్తున్నది. అంగన్‌వాడీల పర్యవేక్షణతో పాటు నిరంతర కార్యక్రమాల నిర్వహణకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. పూర్తి స్థాయి సిబ్బందిని నియమించకపోవడంతో సకాలంలో పనులు పరిష్కారం కాక ప్రజలు, ఉద్యోగులు ఇక్కట్లు పడుతున్నారు. పూర్తి స్థాయి జిల్లా సంక్షేమ అధికారిని నియమించక పోవడంతో సమస్యలు పెరుగుతున్నాయి. నిర్మల్, ముథోల్, ఖానాపూర్, భైంసాలలో ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉన్నాయి. జిల్లాలో 916 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. ఇక్కడికి బదిలీపై వచ్చిన డీడబ్ల్యూవో కొన్ని రోజులు దీర్ఘకాలిక సెలవు పెట్టి తర్వాత బదిలీపై వెళ్లారు. దీంతో రాష్ట్ర దివ్యాంగుల శాఖ కమిషనర్ నిర్మల్ సీడీపీవోకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేయగా మూడు నెలలు విధులు నిర్వహించారు. మూడు నెలల తర్వాత రాష్ట్ర కమిషనర్ ప్రస్తుతం జిల్లాలో విధులు నిర్వహిస్తున్న అదనపు కలెక్టర్‌కు జిల్లా సంక్షేమ శాఖ అధికారిగా అదనపు బాధ్యతలు అప్పగించారు. జిల్లా కార్యాలయంలో జిల్లా సంక్షేమ అధికారితోపాటు ఏపీడీ, ఏవో, నలుగురు సీనియర్ అసిస్టెంట్లు, నలుగురు జూనియర్ అసిస్టెంట్లు, సూపరింటెండెంట్, ఏవో, టైపిస్టు ఒకరు, నలుగురు అటెండర్లు, కంప్యూటర్ సిబ్బంది ఉండాల్సి ఉండగా.. కార్యాలయంలో రెగ్యూలర్ ఉద్యోగులు జూనియర్ అసిస్టెంటు, అటెండర్ మాత్రమే ఉన్నారు. ఈ కార్యాలయంలో సిబ్బంది కొరత కారణంగా నిర్మల్ సీడీపీవో కార్యాలయంలో పనిచేస్తున్న కొంతమంది ఉద్యోగులను జిల్లా కార్యాలయంలో కేటాయించారు. వీరే పనులు నిర్వహిస్తున్నారు. సీడీపీవో కార్యాలయ ఉద్యోగులను జిల్లా కార్యాలయంలో కేటాయించడంతో సీడీపీవో కార్యాలయంలో సిబ్బంది కొరత ఏర్పడింది. ప్రభుత్వం కార్యాలయాలలో సిబ్బందిని నియమించకపోవడంతో సమస్యలు కలుగుతున్నాయి. జిల్లా కార్యాలయానికి నిత్యం పనుల నిమిత్తం వస్తుంటారు. సిబ్బంది కొరత వల్ల సకాలంలో పనులు కావడం లేదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కార్యాలయంలో సిబ్బంది కొరత సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

ఫిష్‌పాండ్ పరిశీలన

కడెం, సెప్టెంబర్ 29 : ప్రియదర్శిని మండల సమాఖ్య ఆధ్వర్యంలో ఆదివారం డీఆర్డీవో విజయలక్ష్మీ, సెర్ప్ ఫార్మ్ డైరెక్టర్ రజిత మెహ్వా ఆయిల్ యూనిట్, అలాగే ఫిష్‌పాండ్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కడెం ఐకేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మెహ్వా ఆయిల్ యూనిట్ ద్వారా పలువురికి జీవనోపాధి కల్పించేలా చూడాలని తెలిపారు. అలాగే కడెం ప్రాజెక్టు సమీపంలోని ఫిష్‌పాండ్‌ల ద్వారా మత్స్యకార కుటుంబాలను ఆదుకునేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. కొంతకాలం నిరూపయోగంగా ఉన్న ఫిష్‌పాండ్‌లను వినియోగంలోకి తెచ్చే వారిని అండగా నిలిచేలా చర్యలు చేపడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఈజీఎస్ ఏపీవో జయదేవ్, ఏపీఎం రాజారాం పాల్గొన్నారు.

ఆయిల్ యూనిట్‌ను పరిశీలిస్తున్న డీఆర్డీవో విజయలక్ష్మీ, సెర్ప్ ఫార్మ్ డైరెక్టర్ రజిత

గంజాయి సాగు చేస్తున్న ఒకరి అరెస్టు

వివరాలను వెల్లడిస్తున్న జైనథ్ సీఐ సాయినాథ్ →

బేల, సెప్టెంబర్ 29 : గంజాయి సాగు చేస్తూ అమ్ముతున్న ఒకరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు జైనథ్ సీఐ సాయినాథ్ తెలిపారు. ఆదివారం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్సై రాధికతో కలిసి వివరాలు వెల్లడించారు. మండలంలోని షాహేజ్ తండాకు చెందిన జాదవ్ హీరామన్ తన ఇంటి వద్ద గంజాయి సాగు చేస్తున్నాడు. కొంత తాగడానికి మిగిలిన దానిని ఆదిలాబాద్ రైల్వే స్టేషన్ వద్ద అమ్ముకోవడానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో దుబ్బగూడ(టీ) రోడ్డు జంక్షన్ వద్ద, బేల ఎస్సై రాధిక, సిబ్బంది పట్టుకున్నారన్నాడు. అతని వద్ద ఒక కిలో 300 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. గంజాయి తరలిస్తూ పట్టుబడ్డ హీరామన్ అనే వ్యక్తిపై ఎన్‌డీపీఎస్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు. పట్టుబడిన గంజాయి విలువ సుమారు రూ.33,250 ఉంటుందన్నారు. ఎస్సీ గౌష్ ఆలం ఆదేశాల మేరకు ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి గంజాయి సాగు చేసే గ్రామాల్లో నిరంతర సోదాలు నిర్వహించాలని గంజాయి సాగు, అమ్మకం చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, అలాంటి వారిపై ఉక్కుపాదం మోపాలని తెలిపారు.